
ఈనాడు వనపర్తి
గురువారం సెప్టెంబరు 26, 2024

రెండు నెలలకోసారి ప్రాజెక్టులపై సమీక్ష

పాలమూరు సాగునీటి పథకాలకు ప్రాధాన్యం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



శంకరసముద్రం పరిస్థితులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వివరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎంపీ మల్లురవి తదితరులు

ఈనాడు, మహబూబ్‌నగర్-న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్: పాలమూరు ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నామని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎత్తిపోతల పథకాల పరిధిలో ఎక్కడెక్కడ నిధులు మంజూరు చేయాలో నివేదికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రెండు నెలలకోసారి పాలమూరు ప్రాజెక్టులపై సమీక్షలు చేపడతామన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులను బుధవారం ఆయన మంత్రి జూపల్లి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సందర్శించారు. ఉత్తమ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఇక్కడి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ భూసేకరణ సమస్యలతో పనులు ఆలస్యం అవుతున్నాయని గుర్తించామన్నారు. దీనిపై గురువారం లోగా సమగ్ర సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఉదండాపూర్‌లో భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రావాల్సిన నిధులు ఆరు నెలల్లో చెల్లిస్తామన్నారు. గద్వాల నియోజకవర్గంలో 20 టీఎంసీల నీరు నిల్వ చేసేలా జలాశయాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నార్లాపూర్ వద్ద పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. జలాశయాల సందర్శన వద్ద అక్కడి సమస్యల్ని ప్రస్తావిస్తూ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ పథకాల ఉద్దేశం, వాటి పూర్తి వివరాలపై ప్రాజెక్టు అధికారులను ప్రశ్నించగా కొన్ని చోట్ల అధికారులు తడబాటుకు గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని ఈ పథకాలను వివరించారు.

వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలంటూ ఆందోళన.. : ఉదండాపూర్ జలాశయం పర్యటన ముగించుకుని వెళ్తుండగా ముంపు గ్రామాలకు చెందిన కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రూ.25 లక్షలు ఇస్తామని చెప్పి.. రాత్రికి రాత్రి రూ.16 లక్షలే ఖాతాలో ఎలా జమ చేస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, తమకు న్యాయం జరగకుంటే జలాశయం పనులను అడ్డుకుంటామని తెలిపారు. ఓ దశలో తోపులాట జరిగింది. పోలీసులు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ మల్లు రవి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, స్పెషల్ చీఫ్‌సెక్రటరీ రామకృష్ణారావు, ఈఎన్‌సీ అనిల్, కలెక్టర్లు సంతోష్, విజయేందిర బోయి, నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

20 శాతం కూడా చేయలేదు: జూపల్లి

సమీక్షలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ భారాసకు చెందిన మాజీ మంత్రి ఒకరు వారి హయాంలో 90 శాతం పనులు పూర్తి చేసినట్లుగా చెబుతున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. పాలమూరు జిల్లాలో కుర్చీ వేసుకుని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని కేసీఆర్ చెప్పారన్నారు. ఇప్పటికీ 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. కాలువలు పూర్తి కాకుండా ఆయకట్టుకు నీరెలా ఇస్తారని ప్రశ్నించారు. నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదన్నారు. సక్రమంగా పని చేయకపోవడం వల్లే ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాలకు భారాస రెండు సీట్లకే పరిమితమైందన్నారు.

సమస్యలు వివరించిన ఎమ్మెల్యేలు..: సమీక్షలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ నార్లాపూర్, ఏదుల మధ్యలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని జలాశయాల వద్ద ఒక్కో పంపునైనా సిద్ధం చేసి నీరు ఎత్తిపోసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉదండాపూర్.. ప్రాజెక్టుకు గుండెకాయలాంటిదన్నారు. ● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో 8 గ్రామాల ప్రజలకు నీటి ఊటతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ కింద పరిహారం ఇప్పించాలన్నారు.

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కేఎల్‌ఐ కాలువ 10 చోట్ల తెగిపోయి పంట పొలాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ● ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయించాలన్నారు. కేఎల్‌ఐ 29 ప్యాకేజీలో వంగూరు మండలంలోని 8 గ్రామాలకు నీళ్లు ఇవ్వాలని కోరారు.

● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ వట్టెం జలాశయం కింద డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయకట్టును పెంచాలని కోరారు. ● అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ నెట్టెంపాడు కింద 99వ ప్యాకేజీలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు.

● దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడి మాట్లాడుతూ హాజిలాపూర్, చౌదరపల్లి ఎత్తిపోతల పనులను చేపట్టాలని కోరారు.



నాగర్‌కర్నూల్: సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మేఘారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, నారాయణరెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, విజయుడు, మధుసూదన్‌రెడ్డి

జూరాలకు పెరుగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద పెరుగుతోంది. జలాశయంలోకి బుధవారం సాయంత్రానికి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. 7 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా 88 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జూరాలకు వరద మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో దిగువకు నీటి విడుదల పెంచినట్లు అధికారులు తెలిపారు. అటు కర్ణాటక ప్రాజెక్టులకు సైతం వరద స్వల్పంగా పెరిగినట్లు సమాచారం.

ఇక.. స్వచ్ఛమైన తాగు నీరు

న్యూస్‌టుడే, వనపర్తి గ్రామీణం, కొత్తకోట

మిషన్ భగీరథలో శుద్ధజలం సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా.. స్వచ్ఛత లేని కారణంగా ప్రజలు వాటిని తాగేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరాకు అవసరమైన సిబ్బందిని గుర్తించి శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో నిరంతరం వీటిపై పర్యవేక్షణ ఉండేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చి సమస్యల్ని పరిష్కరించేలా పూనుకుంది. గ్రామాల్లో తాగునీటికి ఉపయోగించే బోరుబావులు, ఇతర తాగునీటి వసతుల్ని పునరుద్ధరించేలా, వాటి మరమ్మతుల్ని గ్రామ తాత్కాలిక సిబ్బంది సమర్థంగా పూర్తి చేసేలా శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల్లో 737 ఉపరితల ట్యాంకుల్లోకి భగీరథ నీళ్లను నింపి 1,694 కి.మీ. పొడవున అంతర్గత పైపులైను ద్వారా 1,07,731 ఇళ్లకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నారు.

భగీరథ పథకం ద్వారా

గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేయకపోయినా, నీటిని సరఫరా చేసే పైపులైను ఎక్కడైనా పగిలినా నీరు కలుషితమయ్యే అవకాశముంది. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినా.. మరమ్మతులు చేయాల్సిన నిపుణులు అందుబాటులో లేకపోయినా.. వారు సమయానికి రాకపోతే సరఫరా నిలిచి సమస్య జటిలమయ్యే అవకాశముంది. అత్యవసర సమయాల్లో గ్రామ పంచాయతీలే స్వయంగా వీటిని మరమ్మతులు చేసుకునేలా గ్రామానికో మంచినీటి సహాయకుడిని సుశిక్షితులుగా తీర్చిదిద్దుకోవాలని జల్‌జీవన్ మిషన్ మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ శాఖ ద్వారా నిర్ణయించింది.



కొత్తకోట: చేతిపంపు మరమ్మతుపై శిక్షణ పొందుతున్న సిబ్బంది

శిక్షణ ప్రారంభం

ప్రతి గ్రామ పంచాయతీలో 45 ఏళ్ల వయసు, 8వ తరగతి పూర్తి చేసిన వాటర్‌మెన్‌ను, ఆ అర్హతలున్న వ్యక్తి అందుబాటులో లేకపోతే కారోబార్, మల్టీపర్పస్ వర్కర్‌ను మంచినీటి సహాయకుడిగా ఎంపిక చేశారు. వారికి నాలుగు అంశాలైన నీటి నాణ్యత, సంరక్షణ, ఎలక్ట్రికల్ బోర్డు, పంపుసెట్ల నిర్వహణ, చేతి పంపుల మరమ్మతులు, స్తంభింగ్‌పై నాలుగు రోజుల పాటు నిపుణులతో జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం నుంచి ప్రారంభమైన శిక్షణ అక్టోబరు 10వ తేదీ వరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో కొనసాగనుంది. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల్లో 315 మంది (పెద్ద పంచాయతీల్లో ఇద్దరు చొప్పున) సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నారు. రోజూ ఒక అంశంపై ఉదయం పాఠాలు చెప్పడం, మధ్యాహ్నం క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా చేయిస్తారు. ఈ నాలుగు అంశాల్లో నెల 13న హైదరాబాద్ లో శిక్షణ పొందిన ఏఈలు తరగతులు నిర్వహిస్తున్నారు.

మండలాల వారీగా..

ఈ నెల 27వ తేదీ వరకు మొదటి విడతలో కొత్తకోట, ఖిల్లాగణపురం, పెద్దమందడి, పెబ్బేర్, శ్రీరంగాపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో, రెండో విడతగా అక్టోబరు ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు పాన్‌గల్, వనపర్తి, ఆత్మకూరు, అమరచింత, గోపాల్‌పేట, రేవల్లి మండలాలు, మూడో విడతగా 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వీపనగండ్ల, చిన్నంబావి, మదనాపురం మండలాల్లో శిక్షణ కొనసాగనుంది.

తాగునీటి సమస్య ఉండొద్దని..

గ్రామాల్లో తాగు నీటి సమస్య ఏర్పడొద్దని ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో సమస్య లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించేలా గ్రామ నీటి సహాయకులకు శిక్షణ ఇస్తున్నాం. మంగళవారం జిల్లాలో నాలుగు మండలాల్లో మొదలైంది. అక్టోబరు 10వ తేదీ వరకు జిల్లాలో పూర్తవుతుంది. వీరికి ఏరోజుకు ఆరోజు పనిని బట్టి ఆయా గ్రామ పంచాయతీలు (కూలీ) వేతనం ఇచ్చేలా ఒప్పందంతో నియమించుకున్నారు.

- మేఘారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ, వనపర్తి

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఉన్నత స్థానాలకు చేరేందుకు కృషి చేయాలని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో నూతన విద్యార్థుల స్వాగతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులను సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గోపాల్

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : రానున్న పది రోజుల్లో వర్షాలు కురిసే అవకాశముందని నెలరోజుల పాటు కాలానుగుణ వ్యాధుల ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. దోమలు ప్రబలకుండా ప్రతి మంగళ, శుక్రవారాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సామాజిక కేంద్రాల్లో డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 30ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ మధుమేహం వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి జిల్లాలోని మూడు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా మధుమేహ పరీక్షలు ప్రారంభించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో డీఎంహెచ్ జయచంద్రమోహన్, వైద్యకళాశాల ప్రిన్సిపల్ సునందిని, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాయినాథ్‌రెడ్డి, వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

జిల్లాలో 11.5మి.మీ సాధారణ వర్షపాతం

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే : వనపర్తి జిల్లాలో బుధవారం ఉదయం 8.30 గంటల వరకు 11.5 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు అయింది. శ్రీరంగాపురంలో 56.7మి.మీ అత్యధికంగా, రేవల్లిలో 0.3మి.మీ అత్యల్పంగా కురిసింది. అమరచింతలో 2.6 మి.మీ, ఖిల్లాగణపురంలో 10.5, పాన్‌గల్‌లో 12.2, కొత్తకోటలో 0.6, ఆత్మకూరులో 1.0, పెబ్బేరులో 41.4, వీపనగండ్లలో 7.9, చిన్నంబావిలో 28.0 మి.మీ వర్షపాతం నమోదు అయిందని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారిణి రాణి తెలియజేశారు.

విద్యాలయాలకు నిర్వహణ నిధులు

● ఉమ్మడి జిల్లాకు రూ. 9.53 కోట్లు
● తొలి విడత 50 శాతం విడుదల



కొండనాగుల జడ్పీ ఉన్నత పాఠశాలలోని శౌచాలయాలు

అచ్చంపేట, న్యూస్‌టుడే: పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో హెచ్‌ఎంలు సొంతంగా ఖర్చు చేసేందుకు ఇబ్బంది పడ్డారు. మొదటి విడతగా 50 శాతం నిధులు విడుదల కావడంతో కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు హెచ్‌ఎంలు సొంతంగా ఖర్చు చేసిన నిధులను ఏఏపీసీ కమిటీల తీర్మానంతో మినహాయించుకోవడానికి అవకాశం కల్పించారు. త్వరలో రెండో విడత మరో 50 శాతం నిధులు విడుదల చేయనుండటంతో పాఠశాలల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడానికి వెసులుబాటు ఏర్పడింది. సర్కారు బడుల్లో నిర్వహణ కోసం 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమైన మూడు నెలల తరువాత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కనీస అవసరాలైన సుద్ద ముక్కలు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, స్టేషనరీ, చార్టులు, పరీక్షల నిర్వహణ, కంప్యూటర్ సామగ్రి, శౌచాలయాల నిర్వహణ, తాగునీరు, మరమ్మతు పనులు, ఇంటర్నెట్, ప్రయోగశాలల పరికరాలు, రసాయన సామగ్రి, జాతీయ పండుగల నిర్వహణ, డస్టర్లు, చీపుర్లు, బకెట్లు, బిందెలు, సబ్బులు తదితర వస్తువులను కొనుగోలు చేసేందుకు ఏటా సర్కారు నిధులు కేటాయిస్తోంది. గతంలో ఈ నిధుల నుంచే విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించేవారు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉచిత విద్యుత్తును అందిస్తుండటంతో కొంత భారం తగ్గింది. నిధుల విడుదలలో జాప్యంతో హెచ్‌ఎంలు సొంత నిధులు పెట్టి అవసరమైన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వెసులుబాటు కలగనుంది. పాఠశాలల నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లాలోని 3,032 పాఠశాలలకు మొత్తం రూ.9.53 కోట్లు మంజూరు చేసింది. మొదటి విడతగా అందులో 50 శాతం నిధులు రూ. 4.76 కోట్లు విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాకు నిధులు (రూ.లలో)

జిల్లా	పాఠశాలలు	విడుదల
గద్వాల	447	87,90,000
మహబూబ్‌నగర్	795	1,16,67,500
నాగర్‌కర్నూల్	834	1,13,02,500
నారాయణపేట	460	84,37,500
వనపర్తి	496	74,75,000
మొత్తం	3,032	4,76,72,500

● ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, ఆదర్శ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించారు. ఈ నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) తీర్మానంతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది.

- డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్

కొనసాగిన సరళాసాగర్ ప్రవాహం

మదనాపురం, న్యూస్‌టుడే : మండలంలోని సరళాసాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో ఆటోమెటిక్ సైఫన్ల కవాటాల నుంచి బుధవారం నీటి విడుదల కొనసాగింది. రెండు ప్రైమింగ్, నాలుగు ఉడ్ సైఫన్ల కవాటాల నుంచి సుమారు 8 వేల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోందని ప్రాజెక్టు ఏఈఈ రణిల్‌రెడ్డి తెలిపారు. మదనాపురం సమీపంలో ఉన్న ఊకచెట్టు వాగుపై ఉన్న లో లెవల్ వంతెనపై వరద నీరు పారడంతో మదనాపురం - ఆత్మకూరు మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ నెల్విడి రైల్వే గేట్ మీదుగా రైలు పట్టాల వెంట నడుచుకుంటూ మదనాపురానికి చేరుకున్నారు. క్రమంగా వరద తగ్గుముఖం పట్టడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.



మదనాపురం లో లెవల్ వంతెనపై కుటుంబ సభ్యుల సాయంతో వరద నీటిలో వెళ్తున్న విద్యార్థులు

తీరంలో భూమాయ



కృష్ణ మండలం ముడుమాల్‌దొడ్డి శివారులో సర్వే నెం.45లో ప్రభుత్వ భూమి

కృష్ణా, మాగనూరు మండలాల్లో గతంలో విడతలవారీగా బడుగువర్గాలకు 2140 ఎకరాల భూమి ఎసైన్‌మెంట్ కమిటీ ద్వారా కేటాయించారు. పట్టాలిచ్చారు. . కొందరికి పాసు పుస్తకాలున్నాయి. కానీ భూమి ఎక్కడుందో హద్దులేమిటో ఇప్పటికీ తెలియదు. చేతులు మారిందేమోనన్న అనుమానం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

న్యూస్‌టుడే, కృష్ణా

గతంలో నిరుపేద రైతులకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మంజూరుచేసిన భూములు అధికారుల సంతకాలకే పరిమితమయ్యాయి. ఒక్కొక్క రైతుకు అప్పట్లో మూడు నుంచి ఐదెకరాల భూమి కేటాయించి పట్టాలు ఇచ్చారు. చాలామంది రైతులకు ఇప్పటి వరకూ తమ పేరిట ఉన్న భూమి ఎక్కడన్నది చూపించలేదు. గతంలో పట్టాలు తీసుకున్న వారిలో కొందరు కాస్తులో ఉన్నారు. ధరణి వచ్చాక వారి పేరిట ఉన్న పట్టాలు నిలిపి వేశారు. వారికి అందాల్సిన రైతు బంధు నిలిపివేశారు. వారంతా ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మాగనూరు, నేరేడ్‌గం, ఆలంపల్లి, అడవిఖానాపూర్, ముడుమాల్, వడ్వాట్, అయినాపూర్ గ్రామాలలో అసైన్‌మెంట్ ద్వారా ఇచ్చిన భూముల వివరాలు మొత్తం గందరగోళంగా ఉన్నాయి. సరిదిద్దాల్సిన అధికారులు సర్వేయర్లపైకి నెపంనెట్టి జారుకుంటున్నారు. వందల ఎకరాల అసైన్‌మెంట్ భూమి ప్రశ్నార్థకంగా మారింది. ఆలంపల్లి శివారులోని 302, 305, 306 సర్వే నంబర్లలో అప్పటి రైతుల పేర్లు ఇప్పుడు లేవు. వాటిపై విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏళ్లకు ఏళ్లుగా సమస్య : 1972 నుంచి 2006 వరకు అసైన్‌మెంట్ భూ పంపిణీ జరిగింది. నేటి వరకూ కొందరు మాత్రమే లబ్ధి పొందారు. చాలా మంది పేర్లు అసైన్‌మెంట్ కమిటీలో ఉన్నా ఇప్పుడు వారి పేర్లపై భూములు లేవు. ఒకటీ అరా తప్ప మిగతావి అన్యాక్రాంతమైపోయాయి. కృష్ణా తీరంలో బడుగువర్గాలకు ఇచ్చిన భూములు చాలావరకు వేరే వర్గాల పేరుపై రిజిస్ట్రేషన్ కావడంలో మతలబు ఏమిటో అర్థం కావడం లేదు.

అర్జీ ఇస్తే పక్కకే : అసైన్‌మెంట్ భూముల విషయంలో వస్తున్న అర్జీలను సర్వే పేరుతో పక్కకు పెడుతున్నారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత మొత్తం అసైన్డ్ భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి వివరాలు బయటకు వెల్లడించడం లేదు. పలు గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులు చాలా వరకు బుట్ట దాఖలయ్యాయి. 'ప్రజావాణి'లో కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్నా అదే పరిస్థితి ఉంది.

ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలోకి...:

గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకే నిషేధిత భూముల జాబితాలో చేర్చాం. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సంక్రమించిన భూములకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తాం. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయితే తదుపరి చర్యలు చేపడతాం.


- సురేష్, తహసీల్దారు, మాగనూరు.



మా నాన్నకు ప్రభుత్వ భూమి ఐదెకరాలు సంక్రమించింది. ఇద్దరు అన్నదమ్ములం సమానంగా పంచుకుని సాగు చేసుకుంటున్నాం. భారాస హయాంలో పట్టాలు రద్దు చేశారు. నేటికీ అదే పొలంలో పంటలు వేసుకుంటున్నాం. మాకు అన్యాయం చేయవద్దు. - సాధు నర్సప్ప, గురురావు లింగంపల్లి



మూడు దశాబ్దాల క్రితం గుడేబల్లూర్ శివారులో భూమికి పట్టా పాసుపుస్తకం ఇచ్చారు. బ్యాంకులో రుణం తీసుకున్నాను. రైతుబంధు వచ్చింది. మా భూమి ఎక్కడుందో అడిగితే మాత్రం చెప్పడం లేదు. - వండ్రపోల్ల శివప్ప, గుడేబల్లూర్



నా భార్య ఉమాదేవి పేరిట అయినాపూర్ శివారులో మూడెకరాలు పట్టా ఇచ్చారు. నాటి నుంచి నేటి వరకూ మాకు ఇచ్చిన భూమి ఎక్కడ ఉందని అడిగితే అధికారులు సమాధానం చెప్పడం లేదు. పేరుకే పట్టాలు ఇచ్చి రికార్డులలో పేర్లు తారుమారు చేశారేమో అనుమానం కలుగుతోంది. - గుండప్ప సవకార్, గుడెబల్లూర్.

హోరాహోరీగా పోటీలు

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో రెండవ రోజు బుధవారం పాఠశాల విద్యార్థులకు మండలస్థాయి పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో కబడ్డీ ప్రథమ స్థానంలో మైనార్టీ బాలికల గురుకుల, ద్వితీయ స్థానంలో కడుకుంట్ల ఉన్నత పాఠశాల విజయం సాధించాయి. ఖోఖోలో ప్రథమంలో పెద్దగూడెం ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో మైనార్టీ బాలికలు జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో కబడ్డీ ప్రథమంలో చిట్యాల బీసీ గురుకుల, ద్వితీయ స్థానంలో వనపర్తి బాలుర ఉన్నత పాఠశాల నిలిచాయి. వాలీబాల్ ప్రథమంలో మైనార్టీ గురుకుల బాలుర, ద్వితీయస్థానంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వనపర్తి నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు మణ్యం, పీడీ సురేందర్‌రెడ్డి, మండల స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహకుడు కుమార్ పాల్గొన్నారు.

వట్టెం పంపుహౌస్‌లో తేలిన మోటార్లు

నీటి తిరిగి ఎత్తిపోత


వట్టెం పంపుహౌస్ ఇదే..

నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, న్యూస్‌టుడే : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం జలాశయం వద్ద చేపట్టిన పంపుహౌస్‌లో మునిగిన మోటార్లు బుధవారం తేలాయి. ఈనెల 2న వచ్చిన భారీ వర్షాలకు శ్రీపురం, ఉయ్యాలవాడ, కుమ్మెర గ్రామాల వద్ద ఉన్న ఆడిట్ టన్నెళ్ల ద్వారా నీరు లోపలికి వెళ్లాయి. పంపుహౌస్‌లోని మోటార్లు పూర్తిగా మునిగిపోయాయి. 20 మీటర్ల వరకు నీరు నిల్వగా మారింది. శ్రీపురం నుంచి వట్టెం వద్ద ఉన్న పంపు హౌస్ వరకు ఉన్న టన్నెల్ పూర్తిగా నీటిలో ఉంది. మోటార్లు మునిగిన తర్వాత ఈ 4వ తేదీ నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడివేసే పనులను చేపట్టారు. ముందుగా మోటార్లను బయటికి తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 40 మోటార్ల ద్వారా నిత్యం నీటిని తోడివేస్తున్నారు. వారం రోజులుగా సర్జిపుల్ నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు వెళ్లకుండా షట్టర్ల మూసివేత పనులు చేపట్టారు. ఆరుగురు గజ ఈతగాళ్లను పిలిపించి షట్టర్లలో నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు రాకుండా చర్యలు చేపట్టారు. బుధవారం మోటార్లు తేలాయి. 15 కిలో మీటర్ల పొడవునా ఉన్న టన్నెల్‌లో మాత్రం నీళ్లు అలాగే ఉన్నాయి. పంపుహౌస్‌లో ఉన్న నీటిని ఐదు హెచ్‌పీ మోటార్ల ద్వారా తోడివేశామని, మోటార్లకు మరమ్మతులు చేస్తున్నట్లు ఈఈ పార్థసారథి తెలిపారు.


మోటారు భాగాలు విడదీసి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

9 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం నుంచి వరద నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి చేపట్టేందుకు జెన్‌కో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. గడచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.017, దిగువన నాలుగు యూనిట్ల ద్వారా 2.910 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఉత్పత్తి ఎగువన 193.074, దిగువన 167.034 మిలియన్ యూనిట్లకు చేరిందని జెన్‌కో ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) సూరిబాబు తెలిపారు.

అమ్మాయిలు తగ్గిపోతున్నారు..!

● నాగర్‌కర్నూల్ జిల్లాలో గత ఏడాది బాలురు 6,639 మంది జననాలు నమోదైతే.. అమ్మాయిలు 5,913 మాత్రమే ఉన్నారు. ఆ జిల్లాలో లింగనిష్పత్తి వెయ్యి మంది అబ్బాయిలకు 891 మంది అమ్మాయిలు మాత్రమే ఉన్నారు. ఇలాగే కొనసాగితే బాలికల శాతం ఇంకా తగ్గే ప్రమాదం ఉంది.

● మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాది జనాభా వివరాల ప్రకారం 10,82,264 మంది ఉన్నారు. అందులో అమ్మాయిలు 6,979 మంది ఉంటే అబ్బాయిలు 7,617 మంది ఉన్నారు. వెయ్యి మంది అబ్బాయిలతో పోల్చుకుంటే అమ్మాయిలు 916 మంది మాత్రమే ఉన్నారు.


మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జన్మించిన నవజాత శిశువులు

పాలమూరు, న్యూస్‌టుడే

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడేళ్లలో నమోదైన జననాల రేటులో అబ్బాయిల కంటే అమ్మాయిల సంఖ్య తక్కువగా నమోదైంది. వీరిపై చిన్నచూపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పల్లెల్లో, తండాల్లో మగపిల్లలు పుట్టాలని కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇంటి బాధ్యతలు మోస్తాడని.. తల్లిదండ్రులకు ఆధారంగా ఉంటాడని.. వంశాన్ని నిలబెడతాడని.. కొందరు పాత పోకడలను పట్టుకుని వాటిని పాటిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఆడపిల్లలపై వివక్ష కొనసాగించడం ఆందోళనను కలిగిస్తోంది. అబ్బాయిలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించి అమ్మాయిలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేవారున్నారు. ఇద్దరూ సమానమని అవగాహన కల్పిస్తున్నా మార్పు రావడం లేదు.

విచ్చలవిడిగా స్కానింగ్ కేంద్రాలు

భ్రూణ హత్యలు చేయడం నేరం. గుట్టుచప్పుడు కాకుండా గర్భవిచ్ఛిత్తి చేస్తున్నారు. మూడు నెలల క్రితం భూత్పూర్ సమీపంలో ఓ ఆర్‌ఎంపీ పర్యవేక్షణలో వివాహితకు గర్భవిచ్ఛిత్తి వైద్యం వికటించి ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలాంటి నేరాలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. వెలుగులోకి రానివి ఉమ్మడి జిల్లాలో చాలా ఉంటాయి. పట్టణాలు, మండల కేంద్రాల్లో స్కానింగ్ కేంద్రాలు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. ఇక్కడి వచ్చే గర్భిణుల పేర్లు నమోదు చేసుకొని, ఆధార్‌కార్డు వివరాలు రికార్డుల్లో రాయాలి. పూర్తి సమాచారం వారి వద్ద ఉండాలి. కొందరు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు పేర్లు చేసుకుంటున్నారు. పుట్టబోయేది ఆడ లేదా మగ వివరాలు కూడా చెబుతున్నారు. ఈ కేంద్రాలపై వైద్య, ఆరోగ్య శాఖాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.



ఉమ్మడి జిల్లాలో నమోదైన బాలుర, బాలికల జననాల వివరాలు..

(అబ్బాయిలు / అమ్మాయిలు)

జిల్లా	2021-2022 అబ్బాయిలు	2021-2022 అమ్మాయిలు	2022-2023 అబ్బాయిలు	2022-2023 అమ్మాయిలు	2023-2024 అబ్బాయిలు	2023-2024 అమ్మాయిలు
మహబూబ్‌నగర్	8,099	7,577	7,958	7,406	7,617	6,979
నాగర్‌కర్నూల్	6,680	6,062	6,742	6,782	6,639	5,913
వనపర్తి	4,710	4,346	4,606	4,393	4,647	4,030
జోగులాంబ గద్వాల	5,007	4,732	4,984	4,625	4,773	4,268
నారాయణపేట	5,258	4,956	5,234	4,831	5,215	4,637

తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం



మా వద్దకు వచ్చే తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. గర్భం దాల్చిన తరువాత మంచి ఆహారం తీసుకోవాలని చెబుతున్నాం. సమాజంలో అమ్మాయిలు.. అబ్బాయిలతో సమానమనే భావన తల్లిదండ్రుల్లో కలగాలి. సాధారణంగానే బాలికల శాతాన్ని పెంచాలి. లింగనిర్ధారణ పరీక్షలపై నియంత్రణ ఉండాలి. చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి. అమ్మాయిలకు మంచి భవిష్యత్తు ఉంటుంది. వారి కోసం అనేక సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి.

- డా.సంగీత షా, ప్రసూతి విభాగాధిపతి, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నాం



సమాజంలో బాలికలు, బాలురు అనే తేడా లేకుండా ఉండటానికి వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఎక్కడ కూడా భ్రూణ హత్యలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లో వాటి వివరాలు బహిర్గతం చేయరాదు. నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం.

- పద్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మహబూబ్‌నగర్

అక్షరాలు.. ఆకలి తీర్చే ఔషధాలు


మాట్లాడుతున్న గేయ రచయిత అందెశ్రీ

పానగల్, న్యూస్‌టుడే : అక్షరాలు ఆకలి తీర్చే ఔషధం కావాలని గేయ రచయిత, లోక కవి అందెశ్రీ అన్నారు. వనపర్తి జిల్లా పానగల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, పుస్తక సంపాదకుడు సి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫ్లయింగ్‌బర్డ్స్' విద్యార్థుల కవితా సంకలనం పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి అందెశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి ఎదుర్కొనే ఆకలి, ఆశ, కోరికలకు పరిష్కారం అక్షరమే అన్నారు. 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' అన్న గేయం తెలంగాణ ఉద్యమ సమయంలో, నేడు రాష్ట్ర గేయంగా మారినా దానిని నిలబెట్టింది, గుర్తింపునిచ్చింది, బతికించింది పిల్లలేనని గుర్తు చేశారు. తాను నిరక్షరాస్యుడినైనా ..., ఎవరైనా ఎలాంటి పరిస్థితుల్లోనైనా దృఢంగా విశ్వసిస్తే ఎంతటి శిఖరాలకైనా చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థి దశలోనే ఇంత గొప్ప కవిత్వం రాసిన బాలలు రాబోయే రోజుల్లో తమ సాహితీ ప్రక్రియ ద్వారా సమాజంలో ఉన్నత మార్పులు తీసుకురావడానికి తమను తాము గొప్పగా మలుచుకోవాలని సూచించారు. చదువు లేని వ్యక్తి ఏదైనా తప్పు చేయాలంటే ఆలోచిస్తాడని, అదే చదువుకున్న వ్యక్తి ఆలోచించకుండా తప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాలాన్ని అవసరాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. అంతర్జాలం కంటే మన మేధస్సు ఎంతో గొప్పదని, అంతర్జాలం కారణంగా అన్ని మర్చిపోతున్నామని ఆందోళన చెందారు. కులమతాలను పక్కన పెట్టి బోధించాలని ఉపాధ్యాయులను సూచించారు. రాష్ట్ర మంత్రుల కార్యాలయాలకు వెళ్లి వివిధ ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. పాఠశాల ఆవరణలో నీటి వసతి లేదని కూర్చొని విద్యార్థులు కార్యక్రమం చూస్తుంటే ఆయన స్పందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు నరేందర్, మంజుల, ప్రజావాణి జనార్దన్, గాయకుడు సత్తార్, ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాములు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 తరగతులు.. 12 మంది విద్యార్థులు


బుధవారం హాజరైన 8 మంది విద్యార్థులు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీదేవమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో బుధవారం 8 మంది హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు 'న్యూస్‌టుడే' పాఠశాలను సందర్శించగా రెగ్యులర్ ఉపాధ్యాయుడికి బదులు చాకల్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రమేశ్ విధుల్లో ఉన్నారు. వివరాలు ఆరా తీయగా.. రెగ్యులర్ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ బదిలీ అయ్యారని, ఆయన స్థానంలో ... తండాకు చెందిన ఓ ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై నియమించారని తెలిపారు. బుధవారం ఆయన సెలవులో ఉండటంతో తనను ఒకరోజు కోసం పాఠశాలకు పంపించారని పేర్కొన్నారు. గతంలో 30 మంది వరకు విద్యార్థులుండే ఈ పాఠశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరం కేవలం 12 మందికే పరిమితమయ్యారు. ఈ విషయమై మండల విద్యాధికారి శ్రీనివాసగౌడ్‌ను ప్రశ్నించగా తల్లిదండ్రులు పిల్లలను ఆంగ్ల మాధ్యమం కోసం పట్టణాలకు పంపడం వలన విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని, వారి సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

'పాలమూరు కరవుకు కాంగ్రెస్ పార్టీయే కారణం'

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఉమ్మడి పాలమూరును పడావు పెట్టిందే కాంగ్రెస్ పార్టీనని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలమూరులోని ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి ఆంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసిందని పేర్కొన్నారు. పదేళ్లలో కేసీఆర్ తలపెట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై వందల కేసులు వేయించి అడ్డుకున్న పాపం ఆ పార్టీదేనన్నారు. కృష్ణా నది నుంచి రోజూ 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు సముద్రం పాలవుతున్నా రిజర్వాయర్లు నింపుకోలేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతకాని తనమన్నారు. జూరాలపై భారం పడొద్దనే శ్రీశైలం బ్యాక్ వాటర్ కింద కేసీఆర్ 'పాలమూరు-రంగారెడ్డి' మొదలు పెట్టారని గుర్తు చేశారు. మంత్రుల పర్యటనతో పాలమూరుకు ఒరిగేదేమీ లేదని, ఇక్కడి రైతులకు మేలు చేయాలన్న ప్రణాళిక, చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు. భారాసకు భయపడి మంత్రులు హడావిడిగా ప్రాజెక్టుల పర్యటనలు పెట్టుకున్నారని విమర్శించారు.

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త్

పిల్లల్లో శారీరక, మానసిక లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్


తుమ్మిళ్ల పాఠశాలలో ట్యాబ్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: పాఠశాలలకు వస్తున్న విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక వికలత్వంతో పాటు, కొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ఇలాంటి వారికి సంబంధించి ప్రభుత్వం వివరాలు సేకరించనుంది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ ప్రత్యేకంగా ప్రశస్త్ పేరుతో యాప్‌ను రూపొందించింది. ఉపాధ్యాయులే విద్యార్థులను పరిశీలించి వారికి సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంది. ఇలా నమోదు చేసిన వారిలో సమస్య లుంటే పిల్లలకు ఉన్నత స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగానే 25, 26, 27 తేదీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు ఆర్పీలు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారంతా వారి పాఠశాలల్లోని పిల్లల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో : అయిదు జిల్లాల పరిధిలో మొత్తం 3,227 ప్రభుత్వ పాఠశాలలుండగా, 1,200కి పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 5.20 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరి వివరాలు ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, పేరు, సర్వీసు నంబర్, మెయిల్ ఐడీ, చరవాణి, యూడైస్ కోడ్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. తరువాత అందులో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

రెండు భాగాలుగా : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యాక ఈ కార్యక్రమం అమలు కానుంది. దీనిని రెండు భాగాలుగా విభజించారు. ప్రశస్త్ యాప్‌లో పొందుపరిచిన విధంగా ఉపాధ్యాయులు కొన్ని ప్రశ్నలను పిల్లలను అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని వారే నిశితంగా పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది.

● పార్ట్-1 కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబరు 26 వరకు చేపట్టాలి. ఈ సమయంలో యాప్‌లో ఉన్న 64 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపరచాల్సి ఉంటుంది. బోధన సమయంలో ఆ విద్యార్థి సరిగా చూస్తున్నాడా? గమనిస్తున్నాడా? చదువుతున్నా? అవయవలోపం, వినికిడి లోపం, మాటలో తడబాటు, మానసిక వైకల్యం ఇలాంటివి గమనించి నమోదు చేయాలి.

● పార్ట్- 2 కార్యక్రమాన్ని అక్టోబరు 27 నుంచి నవంబరు 14 వరకు చేపట్టాల్సి ఉంటుంది. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని పరిశీలిస్తారు. లోపాన్ని గుర్తించి వైద్యులకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది.



ప్రశస్త్ యాప్ ముఖచిత్రం

మెరుగైన వైద్యం అందేలా..

విద్యార్థులకు సంబంధించి శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, అవయవ లోపం ఉన్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. పేదరికంతో తల్లిదండ్రులు వైద్యం చేయించలేని పరిస్థితులు అయిదు జిల్లాలలోని క్షేత్రస్థాయిలో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే నేరుగా విద్యార్థుల సమస్యలను తెలుసుకొని, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోనుంది.

వంద శాతం నమోదయ్యేలా చూస్తాం



ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వందశాతం నమోదు చేసేలా చూస్తాం. ఇప్పటికే ఈ యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణలు నిర్వహిస్తున్నాం. శిక్షణ ముగిసిన వెంటనే విద్యార్థులందరినీ సూక్ష్మంగా పరిశీలించి వారి లోపాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలు ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

-హంపయ్య, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల

భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య


సాయి

కందనూలు, న్యూస్‌టుడే : భార్య వేధింపులు తట్టుకోలేక భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. రెండో ఎస్సై రమాదేవి కథనం ప్రకారం.. పట్టణంలోని నాగనూల్ బీసీ కాలనీకి చెందిన సాయి (21)కి నెల రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన యువతితో వివాహమైంది. ఆమె మొదటి నుంచి భర్తతో సన్నిహితంగా ఉండకుండా తరుచు వేధించింది. వేధింపులు తట్టుకోలేక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం సాయి బావ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

ధరూర్, న్యూస్‌టుడే: కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై పోక్సో చట్టం కింద బుధవారం కేసు నమోదైంది. డీఎస్పీ సత్యనారాయణ కథనం మేరకు.. ఉమిత్యాల గ్రామానికి చెందిన ఓ బాలిక వారం రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బాలిక మృతికి లైంగిక వేధింపులే కారణమే ఆరోపణలు వచ్చాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు లైంగిక వేధింపుల వల్లనే ఆమె మృతిచెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. దీంతో అదే గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి, జయచంద్ర, వీరేశ్‌లపై పోక్సో చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి వారిని బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

కందనూలు, న్యూస్‌టుడే : బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితురాలితో కలిసి మే 15న నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి ప్రధాన రహదారి పక్కన కారులో భోజనం చేస్తుండగా పట్టణంలోని ఠాణాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ట్యాబ్‌లో ఫొటో తీసి బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేశాడు. అదే ఫొటోను బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహించిన రాంచందర్‌కు పంపడంతో అతను కూడా బాధితుడిని బెదిరించాడు. ఈ ఫొటో భార్య, భర్తల మధ్య కలహాలకు కారణమైంది. ఈ ఘటనపై ఈనెల 23న ఆరోపణలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి మంగళవారం జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు పూర్తి నివేదిక అందజేశారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న రాంచందర్, చిన్నను ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ కనకయ్య బుధవారం రాత్రి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో పోలీసు అదృశ్యం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామకృష్ణ ఆర్థిక ఇబ్బందులతో అదృశ్యమయ్యారని వనపర్తి పట్టణ ఎస్సై జయన్న తెలిపారు. వనపర్తి పీర్లగుట్టలోని పోలీస్‌క్వార్టర్స్‌లో కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారని, మంగళవారం సాయంత్రం ఎస్కార్ట్ విధులకు వెళుతున్నానని భార్య మంజుతో చెప్పి ఇంటి నుంచి వెళ్లి పోయారు. బుధవారం ఉదయం ఆమె ద్విచక్ర వాహనంపై ఉన్న భర్త బ్యాగును చూశారు. అందులో ఉన్న చరవాణి తీసి మెసేజ్ చదివారు. 'సారీ.. మంజు క్షమించు శ్రీరంగాపూర్‌లో పని చేస్తున్న రాకేశ్ మోసం చేశాడని, జీవితాంతం ఉద్యోగం చేసిన అప్పులు తీరే పరిస్థితి కనిపించడం లేదని, రుణాలతో సుమారు రూ.కోటికి ష్యూరిటీ ఇచ్చానని, ఈఎంఐ కట్టే పరిస్థితిలో లేనని అందకు వెళ్లిపోతున్నాని సమాచారం ఇచ్చాడని' ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కానిస్టేబుల్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా బుధవారం తెల్లవారుజామున 3.40 గంటలకు ఆయన హైదరాబాద్ బస్సులో వెళ్లారు. బస్సు చోదకుడిని అడగగా ఎంజీబీఎస్‌లో ఉదయం 6.40 గంటలకు కానిస్టేబుల్ దిగినట్లు తెలిపారని ఎస్సై పేర్కొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

నైపుణ్యాల ప్రదర్శన


వేలి ముద్రలను తనిఖీ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో 2024 సంవత్సరానికి సంబంధించి శాఖాపరమైన నైపుణ్యాలను బుధవారం ప్రదర్శించారు. దీనికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ హాజరై పోలీసు ప్రతిభా పాటవాలను అంచనా వేశారు. మహబూబ్‌నగర్ పోలీస్ విధుల నిర్వహణ కార్యశాలను డీఐజీ ప్రారంభించి మాట్లాడారు. వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. ఫోరెన్సిక్ సైన్స్, నేర పరిశోధన, క్రిమినల్ లా, రాత పరీక్ష, మౌఖిక పరీక్ష, చేతి వేలి ముద్రల సేకరణ, నేరం జరిగిన చోట ఫొటోగ్రఫీ తీసే విధానం, సంఘటన స్థలంలో పోలీసుల నేర శోధనతో పాటు వాహనాల తనిఖీలు, క్షేత్రస్థాయిలో పరిశోధన, గదుల్లో పరిశోధన, కంప్యూటర్‌లో సాంకేతిక పరిజ్ఞానం, పోలీసుల జాగిలాలతో నేరస్థుల గుర్తింపు, నేరం చేసిన తర్వాత నిందితుడు వెళ్లే రహదారి గుర్తింపు, తదితర వాటిపై పోటీలు నిర్వహించారు. ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, డీఎస్పీ సుదర్శన్, సీఐ రాజేందర్ పాల్గొన్నారు.

కొత్త పద్ధతులతో బోధించండి



మాట్లాడుతున్న పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి

పాలమూరు, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు కూడా తమ బోధన పద్ధతులను మార్చుకోవాలని, కొత్తగా వస్తున్న నూతన పద్ధతులను అందిపుచ్చుకోవాలని పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అధ్యాపక బోధన పద్ధతులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తొలిరోజు గ్రంథాలయ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశానికి రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. బోధనా రంగంలో నిత్యం అనేక రకాల మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటిలో అధ్యాపకులు తగిన శిక్షణ పొందాలన్నారు. వృక్షశాస్త్ర ఆచార్యులు డా.సుధాకర్‌రెడ్డి, ఛైర్మన్ డా.చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్, కన్వీనర్ జిమ్మి కాటన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు
మదనాపూరం : 8074538150 వనపర్తి న్యూటౌన్ : 8008573864
అమరచింత : 9490237200 పెబ్బేరు : 9121229043


చెత్తతో నిండిన కుండీ

సమస్య: పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయం వద్ద చెత్త కుండీ నిండింది. పిచ్చిమొక్కలు సైతం పెరిగాయి. - రంగన్న

సమాధానం: పారిశుద్ధ్య పనులు చేపట్టి, పిచ్చి మొక్కలు తొలగిస్తాం. - మంగమ్మ, పుర అధ్యక్షురాలు, అమరచింత

– న్యూస్‌టుడే, అమరచింత

తెరపై ఈనాడు

శ్రీరామ: 100 కోట్లు, వెంకటేశ్వర: మత్తు వదలరా-2
శ్రీనివాస: సరిపోదా శనివారం
– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

కోటిలింగేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకం


అభిషేకం చేస్తున్న భక్తులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కానాయపల్లి స్టేజీ వద్ద వెలసిన శ్రీకోటి లింగేశ్వరాలయంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ అర్చకులు జగదీశ్, అనిల్ తెలిపారు. స్వామి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా భక్తులు, స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు చేశారు.

మత్తు పదార్థాలపై కళా ప్రదర్శన


కళా ప్రదర్శన వీక్షిస్తున్న గ్రామస్థులు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు సమాచార, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళా బృందం మండలంలోని రామాపురంలో బుధవారం కళా ప్రదర్శన నిర్వహించింది. మత్తు పదార్థాల రహిత తెలంగాణ కోసం యువత ముందుండాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి భాస్కర్, కళా బృందం నాయకుడు కృష్ణయ్య, శివలింగం, డప్పు నరసింహ, శ్రీనివాస్, భోనాసి రాజు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాలు ప్రకటించాలి

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : డీఎస్సీ ఫలితాలను ప్రకటించి ఖాళీలను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ కుతూబ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఏఐవైఎఫ్ అధ్యక్షుడు మహేష్‌తో కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి రమేష్, నాయకులు విష్ణు, చందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో సమస్యలను పరిష్కరించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ పెబ్బేరు మండల కన్వీనర్‌గా అంజి, కో కన్వీనర్‌గా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

క్లినిక్ మూసివేత

వనపర్తి న్యూటౌన్: నిబంధనలను ఉల్లంఘించి అనుమతి లేని వైద్యుడితో వైద్య సేవలందిస్తున్న క్లినిక్‌ను వనపర్తి వైద్యశాఖాధికారులు సీజ్ చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. వనపర్తి గాంధీచౌక్‌లో లిబర్టీ క్లినిక్‌ను నిబంధనలు ఉల్లంఘించి మరో వైద్యుడితో వైద్యమందిస్తున్నారని ఫిర్యాదు మేరకు బుధవారం వైద్యసిబ్బంది చంద్రయ్య, రవికుమార్ తనిఖీ చేశారు. అనుమతి తీసుకున్న వైద్యుడితో సేవలందించాలని యాజమాన్యానికి చెప్పారు. నింబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని, క్లినిక్‌ను తాత్కాలికంగా సీజ్ చేశారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు


కొత్తకోటలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు


వనపర్తి గ్రామీణం, కొత్తకోట గ్రామీణం, శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం భాజపా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వనపర్తి, కొత్తకోట, శ్రీరంగాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు దీన్ దయాళ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బర్దన్ జీవితం స్ఫూర్తిదాయకం

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : బర్దన్ పోరాట జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బర్దన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచి బడుగు, బలహీన వర్గాల తరపున స్వరం వినిపించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నాయకులు చంద్రయ్య, కళావతమ్మ, రమేష్, శ్రీహరి, గోపాలకృష్ణ సీఎన్ శెట్టికుతూబ్ పాల్గొన్నారు.

శంకరసముద్రంపై నివేదిక ఇవ్వండి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, చిత్రంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, న్యూస్‌టుడే : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల్లో సమస్యలు వంద శాతం పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కానాయపల్లి వద్ద జలాశయాన్ని ఆయనతో పాటు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు భీమా ప్రాజెక్టు అధికారులతో కలిసి ప్రాజెక్టు పరిశీలించారు. ప్రాజెక్టు స్వరూపాన్ని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి ఉత్తమ్ రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. పునరావాసం సమస్య పరిష్కారానికి కావాల్సిన నిధుల అంచనా వేసి చెప్పాలని ఆదేశించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, సాగు నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ కేశవ్, మధుసూదన్‌రెడ్డి, డీఈ ఎల్లస్వామి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర బాధ్యుడు యుగంధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతులు

నిర్వాసితులందరికీ సమానంగా రూ.12.50 లక్షల పరిహారం ఇవ్వాలని గ్రామనాయకులు సురేందర్‌నాథ్‌రెడ్డి, జితేందర్‌నాథ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నాగరాజు, గోకారయ్య తదితరులు కోరారు. ఆర్‌అండ్‌ఆర్ ప్రయోజనం దక్కాలని, రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. 1,129 ప్లాట్లు చదును చేసి స్థలాలు కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు.

కొత్తకోట గ్రామీణం: పట్టణంలోని శనగ చెరువు కట్టను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. అంజ బావి ఆలయం నుంచి వెంకటగిరి గుట్ట వరకున్న మట్టి దారిని సీసీ రహదారిగా వేయాలని పేర్కొన్నారు. శనగ చెరువు కట్ట అభివృద్ధికి మంత్రి హామీ ఇచ్చారని నాయకులు మేస్త్రీ శ్రీను, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాములు, బోయేజ్, కరుణాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

గ్రామస్థులను తరలిస్తే సరి

శంకరసముద్రం ఎత్తు పెంచడం వల్ల 300 కుటుంబాలకు మాత్రమే సమస్య ఏర్పడుతుంది. వారిని ఇక్కడి నుంచి తరలిస్తే సమస్యకు పరిష్కారం దక్కుతుంది. మిగతా గ్రామస్థులకు ఆర్‌అండ్‌ఆర్ అమలులో ఉంది. వారికి పరిహారం దక్కుతుంది. కొత్త ఇళ్లతో పాటు అక్కడ ఉన్న సమస్యల్ని ముఖ్యమైనవిగా ప్రభుత్వం గుర్తించాలి.
- చిన్నారెడ్డి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆర్‌అండ్‌ఆర్ సమస్య పరిష్కరించాలి

శంకరసముద్రం జలాశయానికి లిఫ్ట్-2లో రెండు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కుల నీటి సరఫరా అవకాశం ఉంది. జలాశయం పనులు పూర్తిచేయక పోవడం వల్ల కేవలం ఒకే పంపుతో 300 క్యూసెక్కులు మాత్రమే ఇస్తున్నారు. శంకరసముద్రం ద్వారా లక్ష ఎకరాల ఆయకట్టును డిజైన్ చేసినా చిన్న సమస్యల వల్ల నీటిని నింప లేక పోతున్నారు. జలాశయం ఉండి, నీళ్లుండి పంపింగ్ చేయలేక పోతున్నాం. ఆర్‌అండ్‌ఆర్ సమస్యలు పరిష్కరిస్తే అన్నింటికీ పరిష్కారం దక్కుతుంది.
- మంత్రి జూపల్లి కృష్ణారావు

రూ.75 కోట్లు కేటాయించండి

జలాశయం పూర్తయినా నీరందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.75 కోట్లు ఇస్తే చాలు పునరావాసంలో ఉన్న సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి. కొత్తగా 28 వేల ఎకరాలకు సాగు నీరివ్వొచ్చు. 2014కు ముందే ప్రాజెక్టు పూర్తయినా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆర్ అండ్ ఆర్ సమస్య కొనసాగింది.
- మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సత్కరించిన మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రశాంత్

మంత్రులకు ఘన స్వాగతం

కొత్తకోట, న్యూస్‌టుడే : శంకర సముద్రం పరిశీలనకు వచ్చిన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం 1.20కి హెలిప్యాడ్‌లో దిగిన మంత్రులను అక్కడే వేచి ఉన్న నాయకులు సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, శంకర్ ప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రశాంత్, బీసుపల్లి యాదవ్, శేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంత్రులకు వినతి

శ్రీరంగాపురం: రంగసముద్రం జలాశయంలో ముంపునకు గురైన నాగరాల నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో మిగిలి ఉన్న భూములను అర్హులకు అందించాలని కోరుతూ.. జలాశయాల పరిశీలనకు వచ్చిన ఎంపీ మల్లురవి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులకి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ వివరాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. జలాశయం కింద కాలువల నిర్మాణం, మరమ్మతులను చేయించాలని కోరామన్నారు.

భాజపా పాలనలో ఆర్థిక శక్తిగా దేశం


వనపర్తి: మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర పరిశీలకులు, క్రమ శిక్షణ కమిటీ రాష్ట్ర ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచ దేశాలు ఆర్థికంగా అతలాకుతలమైనా భారతదేశంలో ఎక్కడ తడబాటు లేకుండా దేశాన్ని ఆర్థికంగా ప్రధాని నరేంద్రమోదీ ముందుకు నడిపించారని భాజపా రాష్ట్ర పరిశీలకులు, క్రమ శిక్షణ కమిటీ రాష్ట్ర ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. బుధవారం వనపర్తిలోని ఓ ఫంక్షన్ హాలులో భాజపా సభ్యత్వ నమోదు మొదటి విడత పై జిల్లా నాయకులు, మాజీ ఎంపీ రాములుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త బూత్‌ల వారీగా 200కు తక్కువగా కాకుండా సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి వేముల నరేంద్రరావు, జడ్పీ మాజీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి, మున్నూర్ రవీందర్, సుమిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు. శ్రీరంగాపురం మండలం తాటిపాములలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అమరచింత: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలందరికి వర్తింపజేయాలని భాజపా రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం అమరచింత మండలం నాగల్‌కడ్మూర్ గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భాజపా జిల్లా కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక శాతం భాజపా సర్పంచులను గెలిపించుకోవాలని జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన మండల భాజపా అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ ఆధ్వర్యంలో మామిడిమాడ, పర్వతాపురంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీపనగండ్ల(చిన్నంబావి): భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎల్లేని సుధాకర్‌రావు, హనుమకొండ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. మండలంలోని గోవర్ధనగిరిలో బుధవారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, మండలాధ్యక్షుడు రాకేశ్, ప్రధాన కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

బస్సులు నిలపాలని రాస్తారోకో


యువకులతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని పిన్నంచర్ల గ్రామ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సులను నిలపాలని కోరుతూ గ్రామ యువకులు బుధవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన రహదారిపై రెండు స్టేజీలు ఉన్నా బస్సులు ఆపడంలేదని వాపోయారు. సీఐ శివకుమార్ చేరుకొని వనపర్తి డిపో మేనేజర్‌తో చరవాణిలో మాట్లాడి, చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్‌గౌడ్, హరీష్, అశోక్‌నంద, కరుణాకర్, శివ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు


శిక్షణ ఇస్తున్న మధుమోహన్, చిత్రంలో ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు

పెబ్బేరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సింది నీటి సరఫరా కార్మికులేనని మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం పెబ్బేరు మండల పరిషత్ కార్యాలయంలో శ్రీరంగాపూర్, పెబ్బేరు మండలాలకు చెందిన నీటి సరఫరా కార్మికులు, కారోబర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై శిక్షకుడు మధుమోహన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ జల్‌జీవన్ పథకం ద్వారా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. తాగునీటి పైపులను లీకేజీలు, మోటార్ల మరమ్మతులపై మరో రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవోలు రవీంద్ర, రవి నారాయణ, డీఈఈ అమీర్ ఖాన్, ఏఈ దేవన్న తదితరులు పాల్గొన్నారు.

పురపాలికల్లో సమస్యలు పరిష్కరించండి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని పురపాలికల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. బుధవారం పురపాలిక సంఘాల కార్మికులు మర్రికుంట నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఊరేగింపుగా వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. అర్హులైన కార్మికులను క్రమబద్ధీకరించి రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. వనపర్తిలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి 12 సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, యూనియన్ నాయకులు నిక్సన్, ఎన్.రాములు, మద్దిలేటి, చంద్రయ్య, బక్కన్న, లాల్ గోపాల్, నరేష్‌గౌడ్, శాంతయ్య, మన్యం, శ్రీనివాసులు, రవిశ్రీ పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారి



శ్రీరంగాపురం నుంచి పుల్గరచర్లకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. వర్షం కురిసిన ప్రతిసారి గుంతల్లో నీరు నిలుస్తుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలోనే సోమవారం జరిగిన ప్రమాదంలో తల్లీకుమార్తెలు మృతిచెందారు. సమస్యపై రహదారులు, భవనాల శాఖ ఏఈని వివరణ కోరగా.. ఇటీవల వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. –న్యూస్‌టుడే, శ్రీరంగాపురం

గోడపత్రికల విడుదల


ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, అధికారులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : అక్టోబర్ ఒకటో తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జడ్పీ సీఈవో యాదయ్య, ఆర్డీవో పద్మావతి, పోలీసుశాఖ తదితరులు వృద్ధుల గౌరవం వారి ప్రేమ శ్రేయస్సు గురించిన గోడపత్రిక, వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి-2011, సవరణ నియమావళి-2022 బుక్‌లెట్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు ఒకటో తేదీ వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. అనంతరం ఆయనతో పాటు అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

వెలగని ఆకాశ దీపాలు


మరమ్మతులకు నోచుకోని ఆకాశ దీపాలు

మండలంలోని నందిమల్ల క్రాస్‌రోడ్డు, కిష్టంపల్లె ప్రధాన కూడలిలో ఆకాశ దీపాలు నిరుపయోగంగా ఉన్నాయి. పీజేపీ నందిమల్ల జలాశయం, మక్తల్ నుంచి నారాయణపేట జిల్లాకు వెళ్లె ప్రధాన రహదారి కావడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విషయంపై ఎంపీవో నర్సింహయ్య మాట్లాడుతూ.. ఇరు గ్రామ పంచాయతీల సమావేశంలో మాట్లాడి, మరమ్మతులు చేయిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, అమరచింత

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

అమరచింత, న్యూస్‌టుడే : ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు భీమార్జున్, ఆశమ్మ, లక్ష్మమ్మ, ఆశన్న, వెంకటన్న కోరారు. ఈమేరకు బుధవారం వారు అమరచింత తహసీల్దార్ రమేశ్‌రెడ్డికు వినతిపత్రం ఇచ్చారు. న్యాయమైన డిమాండ్లను కలెక్టర్ ద్వార ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

పునరావాస గ్రామాల సమస్యలు పరిష్కరిస్తా


మంత్రి జూపల్లితో సమావేశమైన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : మక్తల్ నియోజకవర్గంలోని జూరాల, భీమా ప్రాజెక్టు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలను నాగర్‌కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలో కలిసి మాట్లాడారు. జూరాల, భూత్పూర్, సంగంబండ ప్రాజక్టు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించి పునరావాస గ్రామాలకు రావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

పాత పింఛను పునరుద్ధరించండి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్‌రావు

పెబ్బేరు, న్యూస్‌టుడే : విద్యా రంగంలో సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్ రావు డిమాండ్ చేశారు. బుధవారం పెబ్బేరు మండలంలోని పలు పాఠశాలలో చేపట్టిన పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బౌద్ధరెడ్డి, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రవిందర్‌గౌడ్, దయానంద్, దుర్గాప్రసాద్, శివశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం


కొత్తకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న హిందూవాహిని కార్యకర్తలు

కొత్తకోట, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూను కలుషితం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూవాహిని కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తకోటలో వారు ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. నిరసన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు నరేశ్‌యాదవ్ మాట్లాడుతూ తిరుపతి లడ్డూ అపవిత్రతకు కారకులైన వారిని క్షమించరాదని, ఆ రాష్ట్ర ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ శ్రీకాంత్‌యాదవ్, గౌతం, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, ప్రహ్లాద్, బాలస్వామి పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతంలో ప్రధానోపాధ్యాయులు కీలకం


సంఘం నాయకులను సన్మానించిన సాహితీ కళావేదిక నాయకులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పాఠశాలలను బలోపేతం చేస్తూ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలకు మార్గదర్శనం చేయడంలో ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన భూమిక పోషిస్తోందని సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో వనపర్తి బాలభవన్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చంద్రశేఖర్, మద్దిలేటి, సభ్యులు శంకరయ్య, గణేష్‌కుమార్, మంజులత, ఉమాదేవి, సరస్వతి, కుర్మయ్య, కృష్ణానాయక్, ఆనంద్‌ను సన్మానించారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి గాయాలు

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని కంబాళాపురం సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన చెన్నయ్య తన ద్విచక్రవాహనంపై పెబ్బేరు నుంచి స్వగ్రామానికి శ్రీరంగాపురం మీదుగా వెళ్తున్నారు. కంబాళాపురం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కింద పడిపోయారు. తలకు గాయం కావడంతో, 108వాహనంలో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని..

కొత్తకోట గ్రామీణం: ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగవరం తండాకు చెందిన ఓ కుటుంబం ఆటోలో బీచుపల్లికి వెళ్తుండగా కొత్తకోట పోలీసు స్టేషన్ సమీపంలో వేగనిరోధకం వద్ద ఆటో నెమ్మది కావడంతో వెనుక వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఆటోలో ఉన్న పుల్యానాయక్ కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం 108లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బస్సు ఎక్కబోయి.. కిందపడిన విద్యార్థిని

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : గోపాల్‌పేటలో బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఎక్కబోయి స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన అంజయ్య కుమార్తె శిరీష గాయాలకు గురైంది. ఆరో తరగతి చదువుతున్న ఈమె పాఠశాల వదిలిన తర్వాత కాలనీకి వెళ్లేందుకు బస్టాండులో నాగర్‌కర్నూల్ వెళ్లే బస్సు ఎక్కేందుకు వెళ్లారు. బస్సు ఎక్కుతున్న శిరీష జారి కిందపడిపోయారు. ఆమె కాలు బస్సు చక్రం కిందకు వెళ్లింది. ప్రయాణికులు కేకలు వేయడంతో డ్రైవరు బస్సు ఆపారు. కాళ్లకు గాయాలు కావడంతో వెంటనే వనపర్తికి తరలించారు. బాలికకు తృటిలో ప్రాణాపాయం తప్పింది.

ద్విచక్ర వాహనానికి మంటలు

కొత్తకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ మెకానిక్ షెడ్డులో ద్విచక్ర వాహనాన్ని మరమ్మతు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే తేరుకున్న మెకానిక్ ఇరుగు పొరుగు సాయంతో నీరు చల్లి మంటలు ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా స్పార్క్ వచ్చి ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. ప్రమాదంలో స్కూటీ కొంత కాలి పోయింది.


మెకానిక్ షెడ్డులో మంటలు వ్యాపించిన ద్విచక్ర వాహనం

చేపల వ్యాన్ బోల్తా..

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలో తోమాలపల్లి వద్ద బుధవారం హైదరాబాద్ వైపు వెళ్తున్న చేపల వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడిందని ఏఎస్సై శ్రీనివాసులు గౌడ్ తెలిపారు. చేపల లోడ్‌తో నెల్లూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తోందని, ప్రమాదంలో డ్రైవరుకు స్వల్ప గాయాలయ్యాయని, ఆసుపత్రిలో చికిత్స పొందాడని పేర్కొన్నారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వృద్ధురాలిని ఇంటికి చేర్చిన పోలీసులు

పాన్‌గల్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన శంకరమ్మ అనే వృద్ధురాలు అందరు ఉన్నా అనాథలా సామాజిక భవనంలో తలదాచుకుందని బుధవారం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టింది. పాన్‌గల్ ఎస్సై శ్రీనివాసులు స్పందించి గ్రామానికి వెళ్లి ఆమెను కుమారుడి వద్దకు తీసుకెళ్లి అప్పగించారు. ఇంటి ఆమె బయటికి వెళ్లడానికి కారణాలను గ్రామస్థులు, కుమారుడితో అడిగి తెలుసుకున్నారు. అత్తాకోడళ్లు గొడవ పడి ఇంటి నుంచి వెళ్లడం మళ్లీ తిరిగి వస్తుందని ఈ సందర్భంగా పోలీసులకు వృద్ధురాలి కుమారుడు వివరించారు.